సాక్షి
నిర్మల్
గురువారం । 14 । డిసెంబర్ । 2023



వేడెక్కిన రాజకీయం 8లో▸

సారంగపూర్ మండల రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. తొమ్మిదిమంది బీజేపీ ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ, వైస్ ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం చేసి ఆర్డీవోకు ఇచ్చారు.



సమస్యల్లో 'మధ్యాహ్న' కార్మికులు

ఐదు నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవవేతనం, మూడు నెలలుగా బిల్లులు అందడంలేదు. దీంతో విద్యార్థులకు వండి పెట్టేందుకు వారు ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.0 /23.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి పెరుగుతుంది. రాత్రివేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

బాసర ఆలయానికి రూ.2.50 కోట్ల ఆదాయం



పత్రాలను పరిశీలిస్తున్న ఈవో

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దుకాణాలు, చీరెలు, పూజాసామగ్రి విక్రయం, ఫొటోలు తీయడం, సెల్‌ఫోన్ భద్రపరుచుకునే గది, ఇతర దుకాణాల నిర్వహణకు బహిరంగ వేలం నిర్వహించారు. దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులకు అనుగుణంగా బుధవారం టెండర్ తెరిచారు. ఆలయంలో తొమ్మిది దుకాణాలకు కలిపి రూ. 2,50,08,777 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. మిగతా దుకాణాలకు త్వరలోనే వేలం నిర్వహిస్తామని వెల్లడించారు. బహిరంగవేలంలో దుకాణాలు దక్కించుకున్నవారు ఏడాదిపాటు నిర్వహించుకోవచ్చని సూచించారు.

యాసంగి సాగుపై అవగాహన



శెనగ రైతుకు సూచనలిస్తున్న అంజిప్రసాద్

తానూరు: మండలంలోని కోలూరు గ్రామంలో రైతులు సాగు చేసిన యాసంగి పంటలను జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ బుధవారం పరిశీలించారు. శెనగ, గోధుమ, పెద్ద జొన్న పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. పత్తిలో అంతర్గతంగా సాగు చేసిన కందికి తెగుళ్ల సోకినట్లు రైతులు తెలుపగా నివారణ చర్యలు వివరించారు. అతడి వెంట ఏఈవోలు, రైతులున్నారు.

అల్లంపల్లికి ఆర్టీసీ బస్సు

- రూట్ సర్వే చేసిన అధికారులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్టీసీ సిబ్బంది

కడెం: ఈనెల 11న 'బస్సు ఎరుగని పల్లెలు' శీర్షికన సాక్షిలో ప్రచురించిన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. ఉట్నూర్ డిపో నుంచి అల్లంపల్లికి బస్సు నడిపించేందుకు బుధవారం ఆర్టీసీ సిబ్బంది రూట్ సర్వే నిర్వహించారు. ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు నడిపించాలని గ్రామస్తులు కోరారు. అల్లంపల్లికి త్వరలో బస్సు రానుండగా ఇందుకు కృషి చేసిన 'సాక్షి'కి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లెక్సీల చించివేతపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడెం: మండల కేంద్రంలోని పెద్దూర్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. ఫ్లెక్సీలను రోడ్డుపై పరిచి పేడ పూశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు మల్లేశ్, దేవేందర్‌గౌడ్, రమేశ్ బుధవారం ఎస్సై రాజుకు ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీలు చించివేసిన నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కుష్టు రహిత జిల్లాగా మార్చాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ధనరాజ్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌ను కుష్టు రహిత జిల్లాగా మార్చాలని డీఎంహెచ్‌వో ధనరాజ్ సూచించారు. వ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. బుధవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో కుష్టుపై ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుష్టుపై నిరంతరం నిఘా పెట్టాలన్నారు. వ్యాధి లక్షణాలున్న వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వ్యాధిగ్రస్తుల సమాచారాన్ని నిక్షుత్ పోర్టల్‌లో నమోదు చేసే విధానంపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, డిప్యూటీ జిల్లా విస్తరణ మరియు మీడియా అధికారి బారె రవీందర్, ఫిజియోథెరపిస్ట్ కిషన్‌రావు, రాజేశ్వర్, వినోద్, గంగన్న, నోడల్ సూపర్‌వైజర్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

అవిశ్వాస పర్వం

- అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం
- స్థానిక సంస్థల్లో మొదలైన సమరం
- బలనిరూపణకు ముందే సారంగపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి రాజీనామా
- కాంగ్రెస్ వైపు నిర్మల్ బల్దియా చూపు
- బీజేపీలో చేరేందుకు పలువురి ఆసక్తి



నిర్మల్ మున్సిపాలిటీ కార్యాలయం

నిర్మల్: అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాయో లేదో.. జిల్లాలో అవిశ్వాసపర్వం మొదలైంది. ఎన్నికల ఫలితాల ప్రభావం స్థానిక సంస్థల పాలకవర్గాలపై చూపుతోంది. ప్రధానంగా నిర్మల్ నియోజకవర్గంలో రాజకీయ ఎత్తుగడలు కొనసాగుతున్నాయి. నిర్మల్ మున్సిపాలిటీ, ఎఫ్‌ఎస్‌సీఎస్‌లతోపాటు సారంగపూర్ ఎంపీపీ పదవులపై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమవుతోంది. ఇంతలో సారంగపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయడం ఆసక్తికరంగా మారింది. మరోవైపు తమ పాలకవర్గాన్ని కాపాడుకోవడానికి నిర్మల్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు కాంగ్రెస్‌వైపు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది.

బీజేపీ గెలవడంతోనే..

జిల్లాలో పదేళ్లుగా బీఆర్‌ఎస్ హవా కొనసాగింది. ఎమ్మెల్యేతో పాటు స్థానిక సంస్థల్లోనూ ఆ పార్టీదే అధికారం ఉంది. తాజాగా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు 'కారు'ను పక్కనపెట్టి కమలం, కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. ఖానాపూర్‌లో కాంగ్రెస్ గెలుపొందగా, నిర్మల్, ముధోల్‌లో బీజేపీ గెలిచింది. మూడు చోట్లా బీఆర్‌ఎస్ జాడ లేకుండా పోయింది. నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఏకంగా 50వేల పైచిలుకు ఓట్లతో ఓడిపోగా, ముధోల్‌లో విఠల్‌రెడ్డి కూడా ఓటమిబాట పట్టారు. ఇక ఖానాపూర్‌లో తొలిసారి బరిలో నిలిచిన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మిత్రుడు జాన్సన్‌నాయక్ కూడా ఓటమిని మూటగట్టుకున్నారు. వీరి ఓటమి ప్రభావం వీరి అనుచర ప్రజాప్రతినిధులపై పడుతోంది.

అధికారం లేకపోవడంతోనే..

జిల్లాలో ఓడిపోవడంతో పాటు రాష్ట్రంలోనూ బీఆర్‌ఎస్ అధికారంలోకి రాలేదు. దీంతో ఆ పార్టీకి చెందిన ఎంపీపీ, మున్సిపల్, ఇతర సంస్థల చైర్మన్ పదవులపై గెలిచిన పార్టీలు కన్నేశాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందే నిర్మల్ మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్‌తోపాటు పలువురు పార్టీ ముఖ్యనేతలు బీజేపీలో చేరారు. ఎన్నికల్లో కమలం పార్టీ గెలుపొందడంతో సదరు కౌన్సిలర్‌తో పాటు ఆ పార్టీ నేతలు బల్దియాను కైవసం చేసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారంలో జరుగుతోంది. ఈక్రమంలో ఇప్పటికే పలువురు కౌన్సిలర్లను సంప్రదించినట్లు సమాచారం. స్థానికంగా బీజేపీ గెలిచినా.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో చాలామంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఎటువెళ్లాలో తేల్చుకోలేకపోతున్నట్లు చెబుతున్నారు. మొత్తం మీద 'కారు'ను వీడటం ఖాయమన్న సంకేతాలిస్తున్నారు.

కాంగ్రెస్ వైపు 'బల్దియా'చూపు..

నిర్మల్ మున్సిపాలిటీలో మొత్తం 42వార్డులకుగాను బీఆర్‌ఎస్ ఏకపక్షంగా 30స్థానాల్లో గెలుపొందింది. కాంగ్రెస్ నుంచి ఏడుగురు, ఎంఐఎం నుంచి ఇద్దరు, స్వతంత్రులు ఇద్దరు, బీజేపీ నుంచి ఒకరు గెలిచారు. అనంతర రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌లో కలిసిపోయారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, ఇటు బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే గెలవడంతో పాలకవర్గం పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. ఈనేపథ్యంలో ఎటో ఒకదిక్కు వెళ్లాలన్న ఒత్తిడి పెరుగుతోంది. ఎన్నికలకు ముందే బీజేపీలో చేరి కీలకంగా వ్యవహరించిన కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్ అవిశ్వాసం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన కౌన్సిలర్లలో చైర్మన్ ఈశ్వర్‌తో పాటు మరో 15మంది కాంగ్రెస్‌వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రధానంగా మైనార్టీ వార్డులకు చెందిన కౌన్సిలర్లంతా హస్తం వైపే చూస్తున్నారు. నిర్మల్‌లోని పాతబస్తీకి చెందిన పలువార్డుల కౌన్సిలర్లు మాత్రం స్థానిక పరిస్థితుల నేపథ్యంలో బీజేపీవైపు మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. ఇటీవల ప్రెస్‌మీట్‌లో మాత్రం రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. చైర్మన్, కౌన్సిలర్లు ఎవరూ తమ పార్టీని వీడటం లేదని చెప్పడం కొసమెరుపు.

'కారు'కు మొదటి దెబ్బ..

ఎన్నికల్లో ఓడిపోయిన బీఆర్‌ఎస్‌కు మొదటి దెబ్బ పడింది. ఎక్కడైతే బీజేపీకి రికార్డుస్థాయిలో 12,600 ఓట్ల మెజార్టీ వచ్చిందో.. అదే సారంగపూర్ మండలంలో ఎంపీపీ స్థానాన్నీ కమలం కైవసం చేసుకోబోతోంది. మండలంలో మొత్తం 14ఎంపీటీసీ స్థానాలకు గాను తొమ్మిదింటిని బీఆర్‌ఎస్ గెలుపొందగా, ఐదు కాంగ్రెస్ గెలిచింది. బీఆర్‌ఎస్ నుంచి ఎంపీపీగా కౌట్ల (బీ) సభ్యుడు అట్ల మహిపాల్‌రెడ్డి, ఆలూరు సభ్యురాలు పతాని రాధ వైఎస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్‌కు చెందిన కంకెట, బోరిగాం, సారంగపూర్, పొట్యా, చించోలి (ఎం), బీరవెల్లి ఎంపీటీసీ సభ్యులు బీజేపీలో చేరారు. తాజాగా రెండురోజుల క్రితం జామ్–2 ఎంపీటీసీ సభ్యుడు రాజు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సమక్షంలో కాషాయ కండువా కప్పుకొన్నారు. దీంతో బీజేపీ బలం ఏడుకు చేరింది. బీఆర్‌ఎస్‌కు ఆరుగురే అయ్యారు. మరోవైపు బీఆర్‌ఎస్ నుంచి మరికొందరూ తమకే మద్దతుగా ఉన్నారని, ఎంపీపీ, వైస్ ఎంపీపీపై విశ్వాస పరీక్ష పెట్టాలని నిర్మల్ ఆర్డీవోకు బీజేపీ ఎంపీటీసీ సభ్యులు తీర్మానం అందించారు. ఈ విషయం తెలిసిన వెంటనే సారంగపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుత వైస్ ఎంపీపీ పతాని రాధ ఎంపీపీగా పరిగణించబడతారు. అవిశ్వాసం పెట్టి, తమ సభ్యుల్లో ఒకరిని ఎంపీపీ చేయాలని బీజేపీ భావిస్తోంది. మరోవైపు ఎవరు ఎంపీపీగా ఎన్నికైనా ఆరు నెలలే ఆ పదవిలో ఉండనున్నారు.

ఓటరు జాబితా పకడ్బందీగా రూపొందించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఓటరు జాబితా రూపకల్పన పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, తహసీల్దార్లతో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చేలా కార్యాచరణ అమలు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల పునర్ వ్యవస్థీకరణ చేపట్టాలని, ఓటరు జాబితాలో మరణించిన ఓటర్లను తొలగించాలని, ఓటరు జాబితాలోని లాజికల్ పొరపాట్లు, డెమోగ్రాఫికల్ పొరపాట్లను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో సవరించాలని ఆదేశించారు. చనిపోయిన ఓటర్లుంటే వారి కుటుంబ సభ్యుల నుంచి.. డూప్లికేట్ ఓటరైతే సంబంధిత ఓటరు నుంచి దరఖాస్తులు పొందాలని, వందేళ్లు పైబడిన వారి వివరాలు క్షేత్రస్థాయిలో విచారించాలని సూచించారు. ఫొటో సరిగా లేకున్నా, ఇంటి అడ్రస్ తప్పున్నా, కొత్త ఓటరుగా 30 ఏళ్లు పైబడిన వారు దరఖాస్తు చేసుకుంటే పాత పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడైనా ఓటు ఉందా? అని విచారించి ఫారం–8 ద్వారా దరఖాస్తు చేయించాలని సూచించారు. ప్రతీ పోలింగ్ కేంద్రానికి తప్పనిసరిగా బూత్ లెవెల్ అధికారి ఉండాలని, వీరికి తప్పనిసరిగా బీఎల్వో యాప్‌పై సరైన అవగాహన ఉండాలన్నారు. ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ త్వరగా పరిష్కరించాలని, ధరణి స్లాట్స్, మీ సేవ సర్టిఫికెట్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్లు, డీటీలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అతివలకు అండగా 'షీటీం'

- జిల్లాలో ఆరు కేసులు నమోదు
- ఏడుగురికి పోలీస్ కౌన్సెలింగ్
- హాట్‌స్పాట్‌లపై నిత్యం నిఘా



నిర్మల్‌టౌన్: మహిళలు, బాలికలు, విద్యార్థినుల భద్రతకు షీటీం అండగా నిలుస్తోంది. జిల్లాలో 2016 నవంబర్ 9న షీటీం సేవలు ప్రారంభమయ్యాయి. మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించినా.. ఇబ్బందులకు గురిచేసినా.. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా.. వారిపై ఉక్కుపాదం మోపుతోంది. జిల్లాలో ఇప్పటివరకు 23 మంది ఆకతాయిలను పట్టుకుని కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు పిటీ కేసులు నమోదు చేశారు. కఠినచర్యలకు పాల్పడ్డ ఆరుగురికిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. 2023లో 100 పిటిషన్లు వచ్చాయి. జిల్లాలో హాట్‌స్పాట్ కేంద్రాలను గుర్తించిన పోలీసులు ఈ కేంద్రాలపై మరింత దృష్టి సారిస్తున్నారు.

65 అవగాహన సదస్సులు

ఈ ఏడాది జిల్లాలో షీటీం బృందాలు పాఠశాలలు, కళాశాలలు, షాపింగ్ మాల్స్, పబ్లిక్ స్థలాలు, బస్టాండ్లు, దవాఖానలు, జన సమూహాలు ఉండే ప్రదేశాల్లో 65 అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రజలకు షీ టీం సేవలు, ఫిర్యాదులపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థినులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీ టీం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్ క్రైమ్ అంశాలపై అవగాహన కల్పించారు.

జిల్లాలో 130 హాట్‌స్పాట్‌లు

జిల్లాలోని నిర్మల్, భైంసా డివిజన్ల వారీగా షీటీంలను నియమించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణ ప్రాంతాల్లో 130 హాట్‌స్పాట్‌లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇందుకు షీటీం బృందాలను నియమించి నిఘా పటిష్టం చేశారు. హాట్‌స్పాట్ ప్రదేశాల్లో మహిళలు, యువతులు, విద్యార్థినులపై ఎక్కువగా వేధింపులు జరుగుతున్నట్లు గుర్తించారు. ఇప్పటివరకు ఎస్పీ ప్రవీణ్‌కుమార్ 650 సార్లు హాట్‌స్పాట్‌లలో పర్యటించారు.

నిర్భయంగా ఫిర్యాదు చేయండి



మహిళలు, విద్యార్థినులు ఎవరైనా వేధింపులకు గురైతే భయపడకుండా డయల్ 100కు గాని లేదా షీ టీంను 8712659550 నంబర్‌లో సంప్రదించి ధైర్యంగా ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు రాకుండా ఆకతాయిలకు వారి కుటుంబ సభ్యుల మధ్య కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. అయినా మారకపోతే కేసు నమోదు చేసి శిక్ష విధిస్తాం.

– సుమాంజలి, షీ టీం ఎస్సై, నిర్మల్

పటిష్ట నిఘా ఉంచాం



నిర్మల్‌ను ఈవ్‌టీజింగ్ రహిత జిల్లాగా మార్చేందుకు షీ టీం బృందాలు నిరంతరం కృషి చేస్తున్నాయి. జిల్లాలో 130 హాట్ స్పాట్‌లను గుర్తించాం. వీటిపై పటిష్టమైన నిఘా ఉంచాం. మఫ్టీలో పోలీసులను ఉంచుతూ.. ఆకతాయిల భరతం పడుతున్నాం. మహిళలు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. 24గంటలు పోలీసులు అందుబాటులో ఉంటారు.

– సీహెచ్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ

క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదులు

జిల్లాలో 24గంటలపాటు మహిళల భద్రతకు పోలీసులు కృషి చేస్తున్నారు. ఒకసారి వేధిస్తూ.. పట్టుబడిన వ్యక్తితోపాటు కుటుంబ సభ్యులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. తీరు మారకపోతే కేసు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు. ఆకతాయిలపై ఫిర్యాదు చేసేందుకు వెనుకాడవద్దని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసులు సూచిస్తున్నారు. క్యూఆర్ కోడ్ ఆధారంగా ఫిర్యాదులు చేయవచ్చని అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలోని అత్యంత రద్దీగా ఉండే ప్రదేశాల్లో క్యూఆర్ స్కానింగ్ పోస్టర్లు అందుబాటులో ఉంచారు. స్కాన్ చేయగానే http//tspolice.gov.in లింక్ వస్తుంది. దీనిపై క్లిక్ చేయగానే ఫిర్యాదు ఫాం ఓపెన్ అవుతుంది. అందులో పేరు లొకేషన్ వివరాలు పూరించి సబ్‌మిట్ చేయగానే జిల్లా పోలీస్ కార్యాలయంలోని షీటీం సాఫ్ట్‌వేర్ విభాగానికి ఫిర్యాదు చేరుతుంది. అక్కడ నిరంతరం పర్యవేక్షించే సిబ్బంది ఆన్‌లైన్ ఫిర్యాదులపై దృష్టి సారించి ఆ లొకేషన్ పరిధిలోని అధికారులకు ఫార్వర్డ్ చేయడంతో సంబంధిత పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని తదుపరి చర్యలు చేపడతారు. డయల్ 100కు గాని లేదా షీటీం వాట్సాప్ 8712659550కు లేదా sheteamnirmal123@gmail.comకు ఫిర్యాదు చేసినా తక్షణ సేవలు అందిస్తారు.

కొత్త రేషన్‌కార్డులపై కోటి ఆశలు

- ఏళ్లుగా పెండింగ్‌లోనే దరఖాస్తులు
- నిరీక్షిస్తున్న వేలాదిమంది అర్హులు



భైంసాటౌన్: కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నవారిలో ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం సంబంధిత శాఖ అధికారులతో జరిపిన సమీక్షలో కొత్త రేషన్‌కార్డులపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న వినతులపై ఆశలు నెలకొన్నాయి. రేషన్‌కార్డుపై అందించే ఉచిత బియ్యంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్‌కార్డు ప్రామాణికం కావడంతో అర్హులైనవారు ఏళ్లుగా కొత్త కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. దీంతోపాటు పేర్ల చేర్పు కోసం కూడా చేసుకున్న దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. కొత్త ప్రభుత్వంలో తమకు రేషన్‌కార్డులు అందుతాయనే ధీమాలో దరఖాస్తుదారులున్నారు.

ఏళ్లుగా నిరీక్షణే..

జిల్లాలో కొత్త రేషన్‌కార్డులతోపాటు పేర్ల చేర్పు కోసం వేలాదిమంది దరఖాస్తు చేసుకోగా, ఆర్ఐ, తహసీల్దార్, డీఎస్వో స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వం నుంచి కొత్త కార్డుల మంజూరుపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో దీర్ఘకాలికంగా ఎదురుచూపులు తప్పడం లేదు. ఉన్న కార్డుల్లోనూ పేర్ల మార్పులు, చేర్పులు జరగడం లేదు. దీంతో కార్డులో పేరు లేని వ్యక్తులకు ప్రభుత్వ పథకాలతోపాటు, కార్డుపై అందించే సరుకులు అందడం లేదు. ఫలితంగా నిరుపేదలైన అర్హులు నష్టపోతున్నారు. అంతేగాకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టే పలు సంక్షేమ పథకాలకూ రేషన్‌కార్డు ప్రామాణికం కావడంతో వాటి ప్రయోజనం పొందలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులను త్వరగా మంజూరు చేయాలని కోరుతున్నారు.

జిల్లాలోని రేషన్‌కార్డులు, దరఖాస్తుల వివరాలు

రేషన్‌కార్డులు	2,08,487
లబ్ధిదారులు	6,41,987
కొత్త దరఖాస్తులు	29,744
ఇన్‌స్పెక్టర్ స్థాయిలో పెండింగ్	15,128
తహసీల్దార్ స్థాయిలో..	1,442
డీఎస్వో స్థాయిలో..	7,501
అప్రూవ్ అయినవి	5,222
తిరస్కరించినవి	451

మూణ్నాళ్ల ముచ్చటే..

- కార్పొరేషన్లను రద్దు చేసిన ప్రభుత్వం
- ఐడీసీ చైర్మన్ పదవి కోల్పోయిన చారి



సముద్రాల వేణుగోపాలాచారి

నిర్మల్: రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. బీఆర్‌ఎస్ హయాంలో నియమించిన కార్పొరేషన్ల చైర్మన్ పదవులనూ రద్దుచేసింది. ఇందులో భాగంగా జిల్లా నుంచి ఐడీసీ (ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) చైర్మన్‌గా ఉన్న కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ నేత సముద్రాల వేణుగోపాలాచారి కూడా తన పదవి కోల్పోయారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యే, ఎంపీగా వేణుగోపాలాచారికి రికార్డు ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రిగానూ పనిచేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎక్కువకాలం ఆయన ఢిల్లీలో రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొనసాగారు. ఢిల్లీ స్థాయిలో వ్యవహారాలను చూసుకున్నారు. చివరి సమయంలో ఈ ఏడాది జనవరిలో చారికి ఐడీసీ చైర్మన్ పదవి దక్కింది. ఇంతలోనే ఎన్నికలు రావడం, అందులో బీఆర్‌ఎస్ ఓడిపోవడంతో ఉన్న పదవి కూడా పోయింది. పదకొండునెలలే చారి చైర్మన్ పదవిలో కొనసాగారు.

కొనసాగిన ఉద్యోగుల సమ్మె



సమ్మెలో పాల్గొన్న తపాలా ఉద్యోగులు

భైంసా: భైంసా డివిజన్‌వ్యాప్తంగా గ్రామీణ తపాలా ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం రెండోరోజుకు చేరింది. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే దాకా సమ్మె కొనసాగుతుందని యూనియన్ నాయకుడు సీహెచ్ దేవన్న పేర్కొన్నారు. జీడీఎస్ (గ్రామీణ డాక్ సేవక్) ఉద్యోగులకు ఎనిమిది గంటల పనికి వేతనం చెల్లించి పెన్షన్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులను కేంద్రప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఆలిండియా గ్రామీణ డాక్‌సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ డాక్ సేవక్ ఆధ్వర్యంలో సమ్మె కొనసాగుతోంది. భైంసాతోపాటు ముధోల్, బాసర ట్రిపుల్‌ఐటీ, బాసర, కుంటాల ఎస్వోల ఎదుట జీడీఎస్ ఉద్యోగులు నిరసన తెలిపారు.

బాక్సింగ్‌లో ప్రతిభ చాటిన క్రీడాకారులు



ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాక్సర్లు

నిర్మల్‌టౌన్: మంచిర్యాలలో ఈ నెల 10న నిర్వహించిన ఎస్జీఎఫ్ అండర్–14, 17, 19 బాలబాలికల బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. అండర్–17 బాలికల విభాగంలో సుజల, నక్షత్ర బంగారు పతకాలు సాధించారు. జ్యోతి, సౌజన్య, అనన్య, హర్షిణి, వనజ, అనసూయ కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. అండర్–19 విభాగంలో ముగ్గురు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా బాక్సింగ్ సెక్రటరీ చందుల స్వామి, ఎస్జీఎఫ్ సెక్రటరీ రామారావు, రవీందర్, బాక్సింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ క్రీడాకారులను అభినందించారు.

బాసరలో విజయేంద్ర సరస్వతి పూజలు

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారిని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి మహాస్వామి బుధవారం సాయంత్రం దర్శించుకున్నారు. విజయయాత్రలో భాగంగా బాసర చేరుకున్న ఆయనకు ఆలయ ఈవో, అధికారులు, వైదికబృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక అక్షరాభ్యాస మండపంలో భక్తులకు అనుగ్రహభాషణం చేసి ఆశీర్వదించారు.

గల్ఫ్‌దేశాలకు వెళ్లేవారికి నేడు అవగాహన సదస్సు

నిర్మల్ ఖిల్లా: నూతనంగా గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లాలనుకుంటున్నవారికి గురువారం ఉదయం 11గంటలకు జిల్లాకేంద్రంలోని ఇందిరానగర్‌లోగల ఎస్‌ఎస్‌ఆర్ రిక్రూట్మెంట్ ఏజెన్సీ కార్యాలయంలో ముందస్తు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు. యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సదస్సుకు జిల్లా నుంచి దుబాయ్, మస్కట్, ఖతార్, కువైట్, సౌదీ అరేబియా తదితర గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లాలనుకునేవారు హాజరుకావాలని సూచించారు. ఉపాధి కోసం వెళ్లిన కార్మికులు అక్కడ ఎదుర్కొనే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 8639406104 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

కుంటాలను సందర్శించిన ట్రైనీ ఎఫ్‌బీవోలు



ఎఫ్‌బీవోలతో డిప్యూటీ డైరెక్టర్ సంగీత

నేరడిగొండ: మండలంలోని కుంటాల జలపాతాన్ని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ దూలపెల్లి ట్రెయినీ ఎఫ్‌బీవోలు బుధవారం సందర్శించారు. 34వ బ్యాచ్‌కు చెందిన ఎఫ్‌బీవోలతో పాటు డిప్యూటీ డైరెక్టర్ సంగీత జలపాతం అందాలను తిలకించి ఆహ్లాదాన్ని పొందారు. ఈ సందర్భంగా సిరిచెల్మ రేంజ్ అధికారి గణేష్ జలపాతం విశిష్టతలను ట్రైనీ ఎఫ్‌బీవోలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కుంటాల ఎఫ్ఎస్‌వో వసంత్ కుమార్, ఎఫ్‌బీవో సచిన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వెంకటేశ్(ఫైల్)

భైంసాటౌన్: నిజామాబాద్ జిల్లాలోని బాల్కొండ వద్ద రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భైంసా పట్టణంలోని సిద్ధార్థనగర్‌కు చెందిన ఎలంత్రవార్ వెంకటేశ్ (25) మృతి చెందాడు. కుటుంబీకులు, స్థానికుల కథనం ప్రకారం.. డీజే ఆపరేటర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్ ఆర్మూర్‌లో నిర్వహిస్తున్న ఓ కార్యక్రమానికి డీజే సామగ్రి వాహనంలో నిర్మల్ నుంచి వెళ్తుండగా బాల్కొండ వద్ద రోడ్డుపై నిలిపి ఉన్న మరో వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో బొలేరో వాహనంలోని వెంకటేశ్ మృతిచెందాడు. దీంతో వారి కుటుంబంలో తీవ్ర విషాదం అలుముకుంది.

ఉత్సాహంగా క్రికెట్ జట్లు ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: ఎస్‌జీఎఫ్ అండర్ 17 బాలికల ఉమ్మడి జిల్లా స్థాయి, అండర్ 14 జిల్లా స్థాయి బాలుర క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా క్రికెటర్ల మెళకువలను శిక్షకులు పరిశీలించారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ వంటి అంశాల్లో అత్యుత్తమంగా రాణించిన వారిని ఉమ్మడి జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతోందని ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు పేర్కొన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో ఈనెల 15వ తేదీన ఉమ్మడి జిల్లా ఎంపిక పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఆయన వెంట పోటీల ఆర్గనైజర్ దయానంద్‌రెడ్డి ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: హత్యాయత్నం కేసులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ అశోక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గణేష్ మందిర్‌లో ఉండే కార్తీక్‌పై దాడిచేసిన ఖుర్షీద్‌నగర్‌కు చెందిన శంషీర్, మరో కేసుకు సంబంధించి ఇమ్రాన్, దిల్షద్ ఖాన్‌లపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

వేడెక్కిన రాజకీయం

- ఎంపీపీ, వైస్ ఎంపీపీపై బీజేపీ అవిశ్వాసం
- పదవికి రాజీనామా చేసిన ఎంపీపీ
- వైస్ ఎంపీపీకి బాధ్యతలు



ఆర్డీవోకు అవిశ్వాస తీర్మానాన్ని అందిస్తున్న బీజేపీ ఎంపీటీసీ సభ్యులు, నాయకులు

సారంగాపూర్: మండల రాజకీయ పరిస్థితులు ఒక్కసారిగా వేడెక్కాయి. నిన్న మొన్నటివరకు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై చర్చించుకుంటూ రాజకీయ పరిస్థితులను అంచనా వేసుకున్న వివిధ పార్టీల నేతలు మండల ఎంపీపీపై దృష్టి సారించాయి. తాజాగా బీజేపీకి చెందిన 9మంది ఎంపీటీసీ సభ్యులు బుధవారం ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు పతాని రాధలపై అవిశ్వాస తీర్మానం చేసి ఆర్డీవో రత్నకుమారికి అందజేశారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలకు ముందే 14మంది ఎంపీటీసీ సభ్యులలో పలువురు బీఆర్ఎస్ ఎంపీటీసీ సభ్యులు పార్టీ ఫిరాయించి బీజేపీలో చేరారు. అయితే ఎన్నికల అనంతరం బీజేపీకి చెందిన 9మంది ఎంపీటీసీలు కలిసి ఎంపీపీ మహిపాల్‌రెడ్డిపై అవిశ్వాసం దిశగా అడుగులు వేశారు. వారు ముందుగా చేసుకున్న వ్యూహం మేరకు అవిశ్వాస తీర్మానం చేసి ఆర్డీవోకు అందజేయడంతో ఒక్కసారిగా మండలంలో ప్రజలు మళ్లీ ఎంపీపీ ఎవరికిస్తారోనన్న మీమాంస మొదలైంది.

ఎంపీపీ పదవికి మహిపాల్‌రెడ్డి రాజీనామా...

నాలుగు సంవత్సరాల ఆరునెలల పాటు ఎంపీపీగా విధులు నిర్వర్తించిన మహిపాల్‌రెడ్డి తనపై అవిశ్వాసం పెట్టవచ్చన్న ఊహాగానాలు వినిపించడంతో ఆయనే స్వచ్ఛందంగా తన పదవికి రాజీనామా చేసి సదరు రాజీనామా పత్రాన్ని జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ శంకర్‌కు అందజేశారు. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామాను ఆమోదించారు. ఈ విషయమై ఎంపీపీని వివరణ కోరగా తాను మంత్రి ఐకేరెడ్డి ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశానని తెలిపారు.



రాజీనామా పత్రాన్ని జెడ్పీ సీఈవోకు అందిస్తున్న మహిపాల్‌రెడ్డి

రెండు గంటల్లోనే..

ఎంపీపీ మహిపాల్‌రెడ్డి తన ఎంపీపీ పదవికి రాజీనామా చేసిన అనంతరం రాజీనామాను ఆమోదించిన జెడ్పీ సీఈఓ మండల ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్న పతాని రాధ ఎంపీపీగా బాధ్యతలను అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎంపీడీవో సరోజ, ఎంపీవో తిరుపతిరెడ్డిలు వెనువెంటనే రెండుగంటల్లో ఎంపీపీ బాధ్యతలను రాధకు అప్పగించారు. దీంతో తాజా రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మండల ప్రజల్లో అయోమయం మొదలైంది. తాజాగా నిర్మల్‌లో ఎమ్మెల్యే స్థానం కైవసం చేసుకున్న బీజేపీకి మెజార్టీ ఎంపీటీసీలు ఉండగా మళ్లీ బీఆర్ఎస్ పార్టీకి చెందిన మండల ఉపాధ్యక్షురాలు ఎంపీపీగా బాధ్యతల స్వీకరణతో మండల వాసుల్లో చర్చ మొదలైంది. అయితే బీజేపీ ఎంపీటీసీ సభ్యులు మాత్రం అటు ఎంపీపీ, వైస్ ఎంపీపీలపై అవిశ్వాసం ప్రకటించడంతో తాజాగా ఎంపీపీ బాధ్యతలు స్వీకరించిన పతాని రాధ అవిశ్వాసం ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది.

బీఆర్ఎస్ నేతల శుభాకాంక్షలు...

మహిపాల్‌రెడ్డి రాజీనామా అనంతరం ఉపాధ్యక్షురాలిగా కొనసాగిన రాధ ఎంపీపీగా బాధ్యతలను స్వీకరించడంతో నాయకులు మాధవరావు, అయిర నారాయణరెడ్డి, శ్రీనివాస్, రవీంధర్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, ఆయిటి చందు, పతాని భూమేష్, రాజ్‌మహ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, ఇస్మాయిల్, తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నాణ్యమైన విద్య అందించాలి

- ఆర్ జేడీ సత్యనారాయణ



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్ జేడీ సత్యనారాయణ

బజార్‌హత్నూర్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆర్‌జేడీ సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాల, పిప్రి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసనను మెరుగు పరుచుటకు తరగతి గదుల్లో నిర్వహిస్తున్న ఉన్నతి కార్యక్రమం పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు చదవడం, రాయడంలో ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భూమేష్, విద్యాసాగర్, కౌసల్య , రాజేశ్వర్ పాల్గొన్నారు.

గురుకులాల్లో మెరుగైన విద్యాబోధన

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్



మాట్లాడుతున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన గురుకులాల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు భోజన వసతి కల్పించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం స్థానిక గురుకుల కళాశాలలో ఉమ్మడి జిల్లా గురుకుల ప్రిన్సిపాళ్లతో గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ గంగాధర్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలను బోధిస్తూ వెనుకబడి ఉన్న విద్యార్థులపై దృష్టి సారించి వారి విద్యలో రాణించేలా వారిని తీర్చిదిద్దాలన్నారు. సులువైన రీతిలో అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తూ ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. మంచి విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం సౌకర్యం కల్పించడంతో పాటు విద్యార్థినులకు వసతి గృహాల్లో ఎలాంటి ఇబ్బందలు తలెత్తకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు, పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఉమ్మడి జిల్లా ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల ఆందోళన



ముధోల్‌లో ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

ముధోల్: మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం రద్దు చేయాలని కోరుతూ బుధవారం మండల కేంద్రం ముధోల్‌లోని చౌరస్తా వద్ద ఆటో డ్రైవర్లు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల జీవన ఉపాధిని దెబ్బతీసిందని, రోజువారి కుటుంబ పోషణ కష్టంగా మారిందని ప్రయాణికులు ఎవరు ఆటోలో ఎక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ ఆలోచనను మానుకుని ఆటోడ్రైవర్లను ఆదుకోవాలని కోరారు. రహదారిపైన వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆటో డ్రైవర్లకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు లింగన్న, ఆటో యూనియన్ సభ్యులు ప్రవీణ్, సాయినాథ్ అశోక్, అంజి, సయ్యద్ పాల్గొన్నారు.

మనోధైర్యం ఉంటే అన్నీ సాధ్యమే



బహుమతులు అందిస్తున్న డీడబ్ల్యూవో మిల్కా

ఆదిలాబాద్: మనో ధైర్యం ఉంటే అన్ని సాధ్యమని జిల్లా సంక్షేమ అధికారి మిల్కా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బుధవారం దివ్యాంగుల క్రీడోత్సవాలను డీఆర్‌డీవో కిషన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఏదైనా లక్ష్యాన్ని ఏర్పర్చుకుని దానికోసం పాటుపడితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. జీవితంలో ఎప్పుడూ ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని, అన్ని రంగాల్లో రాణించేలా ఉత్సాహంగా ముందుకు సాగాలన్నారు. పలు క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, దివ్యాంగ క్రీడాకారులు పాల్గొన్నారు.

10 కిలోల కణితి తొలగింపు



తొలగించిన కణితిని చూపిస్తున్న వైద్యులు

నిర్మల్‌చైన్‌గేట్: సారంగాపూర్ మండలం కౌట్ల (బి) గ్రామానికి చెందిన యువతి తీవ్ర కడుపు నొప్పితో జిల్లా కేంద్రంలోని స్వప్న ఆస్పత్రికి వచ్చింది. ఆస్పత్రి జనరల్ సర్జన్ పరీక్షించి సిటీ స్కానింగ్ ఆధారంగా కడుపులో పెద్ద అండాశయ గడ్డ ఉన్నట్లు గుర్తించాడు. బుధవారం ఆపరేషన్ చేసి పదికిలోల గడ్డను తొలగించారు. జనరల్ సర్జన్లు శశికాంత్, గిరీష్ కుమార్ ఆపరేషన్ చేసి గడ్డను తొలగించారు. ప్రస్తుతం యువతి ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉన్నత విద్య చదువుతున్న గిరిజన అభ్యర్థులు నేషనల్ స్కాలర్ షిప్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. అభ్యర్థుల వయసు 1-7-2023 నాటికి 36 ఏళ్లు మించరాదన్నారు. దీనికి ఎటువంటి ఆదాయ పరిమితిలేదని, స్కాలర్‌షిప్ కోసం http://scholarships.gov.in/ ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 31లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి సమాచారానికి http//tribal.nic.in/downlods/guidelines/top వెబ్‌సైట్‌ను సంప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆలయంలో చోరీ

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ శ్రీరాజరాజేశ్వరాలయంలో మంగళవారం రాత్రి హుండీని పగలగొడ్డి అందులోని నగదును ఎత్తుకెళ్లిన సంఘటన చోటుచేసుకుంది. బుధవారం ఉదయం అర్చకుడు జ్ఞానేశ్వర్ పూజచేసి వెళ్లిపోయాడు. తిరిగి సాయంత్రం పూజచేసే సమయంలో హుండీ తాళం పగలగొట్టి ఉన్నట్లు గుర్తించాడు. ఏఎస్సై దేవ్‌రావు చేరుకుని వివరాలు సేకరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఇటీవల నిర్వహించిన అండర్ 14, 17 జిల్లా స్థాయి హాకీ ఎంపిక పోటీల్లో ఇచ్చోడ మండలం బోరిగామ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన అవినాశ్, రాజ్‌కుమార్, లింగన్న, అబ్బు, అక్షర, వైష్ణవి, సాయిప్రియ, పవిత్ర, అలేఖ్య, గాయత్రి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, పీఈటీ రవీందర్ అభినందించారు.

బడీడు పిల్లలు బయటేనా..!





బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ఏటా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం పూర్తిస్థాయిలో అమలుకు నోచడం లేదు. కొందరు పిల్లలు ఇప్పటికీ కుటుంబ పోషణకు గొర్రెలు, పశువుల కాపరులుగా మారుతున్నారు. ఈ చిత్రంలో కనిపిస్తున్న పిల్లలు కుటుంబ పోషణకు తమ గ్రామంలోని గొర్రెల మందను కాసేందుకు ఏడాదికి రూ.50వేల చొప్పున పని కుదుర్చుకున్నవారే. అధికారులు స్పందించి ఇలాంటి వారిని బడికి పంపించేలా కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు. – సాక్షి ఫోటోగ్రాఫర్, నిర్మల్

శనగ సాగే శ్రేయస్కరం



శనగ పంట (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో వానాకాలం సాగు చేసిన పంట దిగుబడులు వస్తున్నాయి. దీంతో కొద్దిరోజుల నుంచి రైతులు యాసంగి సాగుకు శ్రీకారం చుట్టారు. వానాకాలం సాగు చేసిన వరి నారుమళ్లలో తేమ శాతం ఎక్కువగా ఉన్న రైతులు శనగ సాగు చేసుకుంటే శ్రేయస్కారంగా ఉంటుంది. యాసంగిలో వరికి బదులుగా పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయ పరిశోధన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్ చౌహాన్ సూచిస్తున్నారు. పప్పు దినుసులకు మార్కెట్‌లో డిమాండ్ అధికంగా ఉంది. డిమాండ్‌కు అనుగుణంగా పంటలు సా గు చేసుకుంటే మంచి లాభాలు ఆర్జించవచ్చంటున్నారు. పంట సాగుకు చేపట్టాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన మాటల్లోనే...

- యాసంగిలో అనువైన పంట
- నల్లరేగడి నేలలు అనుకూలం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో శనగ సాగుకు అనుకూలమైన నేలలు 70 శాతం ఉన్నాయి. అంతేకాకుండా కొద్దిపాటి నీటితడులతో పంట సాగు చేసుకోవచ్చు. జిల్లాలో చలి వాతావరణం ఎక్కువగా ఉండటం, డిసెంబర్, జనవరి మాసాల్లో మంచు ఎక్కువగా కురుస్తుండడం వలన పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. నవంబర్ నుంచి డిసెంబర్ చివరి వరకు విత్తనం విత్తుకుంటే ఆశించిన దిగుబడి సాధించవచ్చు. పంట సాగులో కొద్దిపాటి సూచనలు పాటిస్తే అధిక లాభాలు సాధించవచ్చు.

విత్తనం వేసుకునే సమయం..

యాసంగిలో నవంబర్ మొదటి వారం నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు శనగ సాగు చేసుకోవచ్చు. డిసెంబర్ తర్వాత విత్తుకుంటే పూత, కాత సమయంలో వాతావరణ మార్పులతో పంట దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉంటుంది.

నేలలు..

సారవంతమైన నల్లరేగడి నేలలు శనగ సాగుకు అనుకూలం. నల్లరేగడి నేలల్లో నిల్వ ఉండే తేమను ఉపయోగించుకుంటూ శీతాకాలంలో మంచుతో మొక్కల్లో పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. చౌడు భూముల్లో విత్తితే ఆశించిన దిగుబడి రాదు. తొలకరిలో వేసిన వరి పైరును కోసిన తర్వాత భూమిని నాగలితో ఒకసారి, గొర్రుతో రెండుసార్లు మెత్తగా దున్ని చదును చేయాలి.

విత్తన రకాలు

శ్వేతరకం: ఈ విత్తనం 80 నుంచి 85 రోజుల వ్యవధిలో పంట దిగుబడి చేతికొస్తుంది. త్వరగా కాపుకు వచ్చే రకం. ఎండ, తెగులును తట్టుకునే కాబూలి రకం ఆలస్యంగా వేసుకోవడానికి అనుకూలం.

విత్తుకోవడం ఇలా..

- విత్తనాలు ఎకరాకు 25 కిలోల నుంచి 30 కిలోల వరకు విత్తుకోవాలి. గింజ సైజును బట్టి లేదా ఆలస్యంగా డిసెంబర్ 15 తర్వాత వేసుకుంటే 20 శాతం పెంచాలి. లావుగా ఉండే కాబూలి రకాలు ఎకరాకు 30 నుంచి 40 కిలోలు వేసుకోవాలి.
- గొర్రుతో గానీ బర్రలతో గానీ జడ్డింగంతో గానీ విత్తుకోవాలి. భూమిలో పదును తక్కువగా ఉన్నప్పుడు నాగలితో విత్తుకోవచ్చు.

ఎరువులు: ఎకరాకు 8 కిలోల భాస్వరం. 16 కిలోల గంధకాన్నిచ్చే ఎరువులను చివరి దుక్కిలో వేసుకోవాలి.

నీటితడులు: భూమిలో ఎక్కువగా తేమ ఉన్నట్లయితే నీరు అందించాల్సిన అవసరం ఉండదు. పూత, కాత దశలో ఉన్నప్పుడు భూమిలో పూర్తిగా పగుళ్లు తేలినట్లు ఉండి ఎండిపోయే సమయంలో కొద్దిపాటి నీరందిస్తే సరిపోతుంది. శనగ వర్షాధారపు పంట. తేలికపాటి నీటి తడులు ఇచ్చి అధిక దిగుబడి పొందవచ్చు. నీటితడులు పెట్టేటప్పుడు నీరు నిల్వ ఉండకుండా చూడాలి. పూత దశకు ముందు ఒకసారి, కాయ దశలో మరోసారి నీటితడి అందించాలి.

నవంబర్ తర్వాత కూడా విత్తుకునే అవకాశం ఉంటుంది.

క్రాంతి: మొక్కలు గుబురుగా పెరిగి గింజలు మధ్యస్థలం కాసి లావుగా ఉంటాయి. ఎండు తెగులును తట్టుకునే రకం. 100 నుంచి 105 రోజుల్లో పంట దిగుబడి వస్తుంది.

అన్నెగిరి: మొక్కలు గుబురుగా పెరిగి, కొమ్మలు ఎక్కువగా వేస్తుంది. గింజలు గోధుమ రంగులో నున్నగా, లావుగా ఉంటాయి. 100 నుంచి 110 రోజుల్లో పంట దిగుబడి వస్తుంది.

జ్యోతి: మొక్క కింది నుంచి గుబురుగా కొమ్మలు వేస్తుంది. గింజలు గరకగా ఉంటాయి. మధ్య స్థలం కాయలు కాస్తాయి. 110 రోజుల్లో పంట చేతికి వస్తుంది.

పూలేజీ 95311: కామూలి రకం గింజలు లావుగా హైబ్రిడ్‌లా ఉంటాయి. 95 నుంచి 100 రోజుల్లో పంట దిగుబడి వస్తుంది.

విత్తన శుద్ధి

- ఎండు తెగులు ఉన్నచోట కిలో విత్తనానికి 4 గ్రాములు ట్రికోడెర్మా విరిడిని వాడితే మంచి ఫలితం ఉంటుంది.
- విత్తనానికి రైజోబియంకల్చర్ పట్టించి విత్తితే 20 శాతం నుంచి 30 శాతం అధిక దిగుబడి సాధించవచ్చు.
- 8 కిలోల శనగ విత్తనానికి ఒక రైజోబియం ప్యాకెట్ (200 గ్రాములు) కలిపి విత్తనం వేసుకుంటే పంటను చీడ పీడలు ఆశించవు.

పీవోను కలిసిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న పీవో

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పీవో పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల సమస్యలపై చర్చించారు. అదే విధంగా ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో పీవీటీవో భాస్కర్‌లు ఎమ్మెల్యేకు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియచేశారు.

దర్గాను సందర్శించిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఉట్నూర్ మండల కేంద్రంలోని దర్గాను బుధవారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి దర్గా వద్ద చాదర్ సమర్పించారు. ప్రతిఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు ఖయ్యూం, ఎక్బాల్, మాజీద్, సలీం ఉన్నారు.

రిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్

ఎదులాపురం: రిమ్స్‌లో పని చేస్తున్న శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుధవారం రిమ్స్‌లో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు సీఐటీయూలో చేరగా యూనియన్ కండువాలు కప్పి వారిని సాధారణంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆవలంభిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై, కార్మిక హక్కుల సాధన కోసం జైలు వెళ్లేందుకు సైతం వెరవకుండా సీఐటీయూ రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ రిమ్స్ కార్మికుల హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటాలకు కార్మికులు ఆకర్షితులై సంఘంలో చేరడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. కార్మిక ఐక్యత, పోరాటం నినాదంతో సమస్యల పరిష్కారం కోసం ఉత్సాహంతో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. నూతన రాష్ట్ర ప్రభుత్వం జీవో నం.60 ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రిమ్స్, ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, పెన్షన్ ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందులో రమాకాంత్, రమేశ్, వెంకన్న, సాయి, శివ, రాకేశ్, అశోక్, సోయబ్ పాల్గొన్నారు.

ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం



అధికారులు పంపిన పత్రం

బోథ్: ఈ ఏడాది మార్చి 7వ తేదీన సాక్షిలో ప్రచురితమైన 'అగ్గిపుడితే బుగ్గేనా..?' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంతో బోథ్ పట్టణానికి చెందిన బోనగిరి కిరణ్‌కుమార్ జులై 7వ తేదీన ప్రజావాణిలో బోథ్‌కు ఫైర్‌స్టేషన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశాడు. కాగా స్పందించిన తెలంగాణ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్‌సేఫ్టీ అధికారుల నుంచి సమాధానం వచ్చింది. అయితే ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపించామని, ప్రభుత్వానికి నివేదికను ఇచ్చామని అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉందని తెలిపారు.